క్లుప్తంగా

అభ్యుదయ సాహిత్య చిరస్మరణీయుడు 'రాంభట్ల'



నగరంపాలెం: అభ్యుదయ సాహిత్య చిరస్మరణీయుడు రాంభట్ల కృష్ణమూర్తి అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ కొనియాడారు. విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవంలో భాగంగా లాడ్జి సెంటర్ ఏఎల్‌బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి విశేష సంచికను, ఆర్వీయార్ (రాళ్లబండి వెంకటేశ్వరరావు) 85వ జయంతి విశేష సంచికల ఆవిష్కరణ, పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘంలో రాంభట్ల, ఆర్వీయార్ ఇద్దరూ ప్రధానమైన పాత్ర పోషించారని తెలిపారు. అరసం అభివృద్ధికి, అభ్యుదయ సాహిత్య ఉద్యమ ప్రగతికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. హిందూ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, ప్రముఖ సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ, అరసం రాష్ట్ర కార్యదర్శి శరశ్చంద్రజ్యోతిశ్రీ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పొన్నూరు: జగనన్న విద్యాకానుకలో భాగంగా గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో ఆర్. శోభాచంద్ తెలిపారు. పొన్నూరు పట్టణంలోని ఆలపాటి సుబ్బరాయ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

మామిళ్లపల్లిలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



పొన్నూరు: ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని మామిళ్లపల్లి సర్పంచి జాలాది యానాదిరావు పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో బుధవారం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ కార్డుల్ని ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యానాదిరావు మాట్లాడుతూ గతంలో రూ. 5లక్షలున్న పరిమితిని రూ. 25 లక్షల వరకు పెంచి ఉచిత వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మన్నవ పీహెచ్‌సీ వైద్యాధికారి మహ్మద్ హుస్సేన్, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



పొన్నూరు: పట్టణంలోని మెయిన్ రోడ్డులో చేపట్టిన అభివృద్ధి పనుల్ని వేగవంతంగా పూర్తి చేయా లని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అధికారుల్ని ఆదేశించారు. మెయిన్ డ్రెయిన్ నిర్మాణ పనుల్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వట్టిప్రోలు రంగారావు, మున్సిపల్ డీఈ ఏడుకొండలు పాల్గొన్నారు.

వీడియో ప్రజెంటేషన్‌లో సెయింట్ జోసఫ్స్ విద్యార్థులకు బహుమతి



పెదకాకాని: నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ షార్ట్ వీడియో ప్రజెంటేషన్‌లో సెయింట్ జోసఫ్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. పెదకాకాని సెయింట్ జోసఫ్స్ హైస్కూలులో బుధవారం ప్రిన్సిపాల్ సిస్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ పవర్ ఆధ్వర్యంలో విజయవాడలో నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ వీక్ నిర్వహించారు. ఈనెల 14 నుంచి 20 వరక జరిగిన షార్ట్ వీడియో కాంపిటీషన్‌లో పెదకాకాని సెయింట్ జోసఫ్స్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ. 20వేలు అందుకున్నారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల్ని ప్రిన్సిపల్ సిస్టర్ సంధ్యారాణి, కరెస్పాండెంట్ రెజీనా మేరి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

నగర మేయర్ కావటి



కేక్ కట్ చేస్తున్న మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ముస్తఫా, కార్పొరేటర్లు



వేడుకల్లో ఘంటసాల శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు



సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో వేడుకలు

నెహ్రూనగర్: క్రీస్తు మార్గం అనుసరణీయమని నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరి, డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడవాలని సూచించారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సందేశాన్ని అందిస్తాయని చెప్పారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. నగర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ లోకంలో ప్రేమ, శాంతి, జాలి, దయ, కరుణ కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై ప్రేమ కలిగి ఉండాలని చెప్పారు. డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు మాట్లాడుతూ క్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని తెలిపారు. డెప్యూటీ మేయర్ షేక్ సజీల మాట్లాడుతూ క్రిస్మస్ అంటే తనకు చాలా ఇష్టమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

ఏపీ ఎన్జీవోల ఆధ్వర్యంలో...

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు ఆధ్వర్యంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు నగరం, పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న గజిటెడ్, నాన్-గెజిటెడ్, సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు. ఏసుక్రీస్తు జన్మదినం గురించి పలువురు ప్రసంగించారు. అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కులమతాలకతీతంగా ఎన్జీవో హోంలో వేడుకను జరుపుకోవడం అభినందనీయమన్నారు. జిల్లాలో పనిచేయుచున్న ఉద్యోగులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, మహిళా విభాగం ఎం.రాధారాణి, కె. లక్ష్మీరమ్య, రోజ్ రాణి, కె. శివ జ్యోతి, విజయలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో...

ఆసుపత్రిలోని పలు విభాగాల్లో సెమీ క్రిస్మస్ వేడుకల్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డాక్టర్ యూనీస్, డాక్టర్ రాధిక, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ప్రియదర్శిని, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని పాల్గొన్నారు.

- ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ జాహ్నవి, నాట్కో సమన్వయ కర్త వై. అశోక్ కుమార్ పాల్గొన్నారు.
- బయో కెమిస్ట్రీ విభాగంలో కేక్‌ను డాక్టర్ కిరణ్ కుమార్ కట్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శోభాదేవి, డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ యూనీస్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, టెక్నికల్ స్టాఫ్ రాజారావు, భాస్కర్ పాల్గొన్నారు.

సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో....

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు కార్యాలయం రోడ్డులోని గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. లూథరన్ సంఘ కాపరులు డాక్టర్ రెవరెండ్ ఆర్.నవకుమార్, రెవరెండ్ శారద, నెమలికంటి న్యూటన్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కె.జి.వి. సరిత, డీఎస్పీ మోహనరావు, సీఐ కెనడీ, ఎస్ఐలు రత్నం, మూర్తి, రమ్య, శేఖర్, రవికిరణ్, ఇశ్రాయేల్, సిబ్బంది పాల్గొన్నారు.

కలసికట్టుగా జగనన్నను సీఎంను చేసుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ , పక్కన సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

ఎమ్మెల్సీ, కృష్ణా గుంటూరు జిల్లాల కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్

గుంటూరు రూరల్: ప్రతి కార్యకర్తా, అభిమాని, నాయకుడు కలసికట్టుగా కృషిచేసి జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా తయారవ్వాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా జిల్లాల కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. రూరల్ మండలంలోని మిర్చి యార్డు సమీపంలో గల అట్లాంటిస్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్తిపాడు నియోజకవర్గం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్నను ముఖ్యమంత్రిగా, ప్రత్తిపాడులో బలసాని కిరణ్ కుమార్‌ను ఎమ్మెల్యేను చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందిందంటే, అది జగనన్న ద్వారానే సాధ్యమైందని పేర్కొన్నారు. సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజవర్గం సమన్వయ కర్తగా నియమించిన జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రతి కుటుంబంలో ఒక సభ్యుడిగా ఉంటానని చెప్పారు. ప్రత్తిపాడు గడ్డ కిరణ్‌కుమార్ అడ్డాగా తయారు చేసే విధంగా ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గాన్ని గెలిపించుకుని, జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తాను ఒక సైనికుడిగా ప్రతి ఒక్కరితో పని చేస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు తాడిశెట్టి మురళి మాట్లాడుతూ కిరణ్ అన్న సౌమ్యుడని, చదువుతో పాటు మంచి సేవా దృక్పథం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన గతం నుంచి తనకు తెలుసునని, మంచి సేవా భావం ఉన్న వ్యక్తని, ప్రతి ఒక్కరూ ఆదరించాలని సూచించారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో విజయకేతనం ఎగురవేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, మహిళా విభాగం నాయకురాళ్లు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

'కాగ్' పనితీరులో పెరుగుతున్న అలసత్వం



సమావేశంలో మాట్లాడుతున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: సర్కార్ ఖజానాకు కాపాలాదారు అయిన కాగ్ (కంపోర్ట్రలర్ అండ్ ఆడిటర్ జనరల్) పనితీరులో నేడు అలసత్వం పెరుగుతోందని ఆరోపణలు వస్తున్నాయని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.అనంత రామయ్య మాట్లాడుతూ కాగ్‌ని బలహీన పరిచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షాల విమర్శలకు సంస్థ పనితీరు కూడా బలం చేకూరుస్తోందని తెలిపారు. ప్రస్తుతం కాగ్ ఆడిట్ నివేదికలు సంఖ్యాపరంగానే కాకుండా నాణ్యతాపరంగా కూడా నాశి రకంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ఇంజినీర్ ఎస్.సదాశివం మాట్లాడుతూ కాగ్ పనితీరు రోజురోజుకూ క్షీణిస్తోందని, 2023లో కూడా పరిస్థితి మెరుగ్గా లేదని విమర్శించారు. భారత రాజ్యాంగం కాగ్‌కు సుప్రీం కోర్టు న్యాయమూర్తితో సమాన హోదా కల్పించిందన్నారు. ఆరోపణల నేపథ్యంలో కాగ్ నియామక ప్రక్రియలో సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో సంస్థ సభ్యులు సింగరయ్య, బసవ గుప్తా పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

పొన్నూరు: పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ అంతర్జాతీయ క్రికెటర్ అంబటి రాయుడు పాల్గొన్నారు. ఫాదర్ అలెక్స్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాయుడు మాట్లాడుతూ విద్యార్థులంతా ఆశయాల్ని నెరవేర్చుకునేందుకు కృషి, పట్టుదల అవసరమని చెప్పారు. ఈ దిశగా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన క్రిస్మస్ నాటిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం అంబటి రాయుడు పదో తరగతిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, ఫాదర్ అలెక్స్, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రీటా, ప్రిన్సిపాల్ లాలి పాల్, సిస్టర్ ఆల్‌ఫ్రెడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సీతారామయ్య స్కూలు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: బీఆర్ స్టేడియంలో ఇటీవల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పి. విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 9వ తరగతి విద్యార్థిని నీహారిక 100 మీటర్లు, జి.విష్ణు 600 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, జ్ఞాన చరిత 800 మీటర్ల పరుగులో ద్వితీయ, అభినయ్ 100 మీటర్ల పరుగులో తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. రిలే రన్‌లో ఏ. నీహారిక, జ్ఞానచరిత, జి. నాగలక్ష్మి, ఎం.శ్రావణి తృతీయ బహుమతులు, లాంగ్ జంప్‌లో ఏ. నీహారిక ద్వితీయ బహుమతి కై వసం చేసుకున్నట్లు చెప్పారు. విద్య జ్ఞానాన్ని అందిస్తే క్రీడలు ఆత్మవిశ్వాసానికి, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో చాంపియన్‌షిప్ అండర్–11, అండర్–14 విభాగాల్లో తమ పాఠశాల విద్యార్థులు బి. రమ్యశ్రీ రెడ్డి, బి. హర్షవర్ధిని, వి. బాలాజీ బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్‌లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ అభినందించారు.

విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా దూర విద్య సేవలు

ఏఎన్‌యూ వీసీ పి. రాజశేఖర్

ఏఎన్‌యూ: విద్యార్థుల ప్రయోజనాలు పరిరక్షించడమే లక్ష్యంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం ద్వారా సేవలు అందిస్తున్నామని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం ద్వారా 2022, 2023 సంవత్సరాల్లో పలు కోర్సులు చదివిన విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. వీసీ ప్రసంగిస్తూ ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం ద్వారా గడిచిన 20 సంవత్సరాలుగా లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందించామని తెలిపారు. దూరవిద్య ద్వారా డిగ్రీలు చేసిన చాలా మంది ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్స్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నాక్ రీ అక్రిడేషన్‌కు వెళ్లనుందని, ఈ క్రమంలో దూరవిద్యాకేంద్రం విద్యార్థుల సహకారం కూడా అవసరమని కోరారు. నాక్ బృందం ఫోన్, ఈమెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా గానీ ఏదైనా సమాచారం కోరితే విద్యార్థులు వారికి తెలియజేయాలని సూచించారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి మాట్లాడుతూ ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం ప్రత్యేక ఖ్యాతి గడిస్తోందన్నారు. దూరవిద్యా కేంద్రం ద్వారా చదివిన వారు కూడా యూనివర్సిటీ విద్యార్థులేనని, వారు కూడా యూనివర్సిటీ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ ప్రసంగిస్తూ దూరవిద్య డిగ్రీలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని తెలిపారు. దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి నాగరాజు దూరవిద్యా కేంద్రం సేవలు వివరించారు. పరీక్షల కో–ఆర్డినేటర్ డాక్టర్ కె. సోమశేఖర్, నాక్ కో–ఆర్డినేటర్ ఆచార్య సంధ్యాకోల్, తక్షశిల ఐఏఎస్ అకాడమీ సీఎండీ దుర్గాప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో దూరవిద్యా కేంద్రం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యవంతమైన జీవనం

ఆరోగ్యవంతమైన జీవనానికి చిరుధాన్యాల తోడ్పడతాయని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీలో నిర్వహించిన మిల్లెట్ ఫెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. చిరుధాన్యాలతో విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాల్ని వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అధిక పోషక విలువలు ఉన్న చిరుధాన్యాలు ఆహారంలో తీసుకుంటే అనేక లాభాలు ఉంటాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి. కరుణ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ విభాగాధిపతి డాక్టర్ కె.వి.శాంతిశ్రీ , అధ్యాపకులు డాక్టర్ బి. భబిత, డాక్టర్ మంజుల, డాక్టర్ జలజ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు. వర్సిటీలోని వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు మిల్లెట్ ఫెస్ట్‌ను సందర్శించి పలు అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో పట్టుదల, పోటీతత్వం



సౌత్ జోన్ జట్టుకు ఎంపికై విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడల వల్ల విద్యార్థుల్లో పట్టుదల, పోటీతత్వం పెరుగుతుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాంనందున్న కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల బాలికల చదరంగం పోటీల్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్య ద్వారానే కాకుండా క్రీడలతో కూడా అత్యున్నత శిఖరాల్ని అధిరోహించవచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినుల్లో ఆరుగురు ఉత్తమ ప్రతిభ కనబరిచి చెన్నైలోని డాక్టర్ అంబేడ్కర్ లా యూనివర్సిటీలో ఈనెల 26 నుంచి 29 వరకూ నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చదరంగం పోటీలకు ఎంపికయ్యారన్నారు. తమ కళాశాల నుంచి బి. సుదీప్త, కె. స్వప్నమాధురి, బి.సాయితేజ, సెయింట్ ఆన్స్ కళాశాల నుంచి పి.శ్రీలక్ష్మి, జె. అనూష, ఉమెన్స్ కళాశాల నుంచి ఎం.సోని ఎంపికయ్యారని తెలిపారు. జట్టు మేనేజర్‌గా పి.భానుప్రకాష్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. జట్టులో ఎంపికైన విద్యార్థుల్ని చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు అభినందించారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం



బెలూన్లు వదిలి క్రీడలను ప్రారంభిస్తున్న మాధవీలత తదితరులు

గుంటూరు రూరల్: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, నైపుణ్యతలు మెరుగు పరుచుకునే దిశగా క్రీడాకారులు కృషి చేయాలని వెంకటరామా పాల్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎం. మాధవీలత తెలిపారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఐపీఎస్ఈం– 2023 పేరుతో ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాధవీలత మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల ద్వారా కూడా ఉజ్వల భవిష్యత్తు, ప్రభుత్వ కొలువులు సాధించవచ్చని తెలిపారు. అనంతరం నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్, అథ్లెటిక్స్ పోటీల్లో వివిధ కళాశాలకు చెందిన 421 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యవర్గం

పెదకాకాని: స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ సాంస్కృతిక భవనంలో బుధవారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు వరికుంట కిశోర్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా పల్లపరంబు జోసఫ్, అధ్యక్షుడిగా ఇల్లా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా కొల్లికొండ ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శిగా షేక్ సలీం, కార్యవర్గ సభ్యులుగా దుర్గం చంద్రశేఖర్, కుక్కల రాంప్రసాద్, నరుకుళ్లపాటి అంకమ్మరావు, నూతక్కి వంశీ, సహాయ కార్యదర్శిగా మురికిపూడి వెంకటరోశీపాల్ శేఖర్, కోశాధికారిగా ఉన్నం భాస్కరరావు నియమితులైనట్లు ఆయన పేర్కొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన మహా యాగం

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాథ కుండాత్మక సప్తమ సహస్ర చండీ మహారుద్ర నవగ్రహ లక్ష్మి గణపతి మహా యాగం, పూజలు బుధవారం నిర్వహించిన మహా మంగళ పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం 8 గంటల నుంచి క్రతువుల్ని నిర్వహించారు. మహా యాగం సందర్భంగా అగ్ని రూపంగా ఉన్న శ్రీ దుర్గాదేవికి మూల మంత్ర హోమం, జపాలు, మహా మంగళ పూర్ణాహుతి, వసోర్ధార,యజ్ఞరక్ష ధారణ, వేదాశీర్వచనంతో పాటు ఋత్విక్కులకు సన్మానం చేశారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మహా మంగళ పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకమండలి సభ్యులు స్వాగతం పలికారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఏఎన్‌యూ జట్టు ఎంపిక



జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో బ్రహ్మం, మనోహర్, శివాజీ

గుంటూరు ఎడ్యుకేషన్: కర్ణాటకలోని మాన్యలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మెన్స్ వాలీబాల్ పోటీలకు ఏఎన్‌యూ నుంచి ఎంపిక చేసిన జట్టు పాల్గొంటున్నట్లు టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జట్టును అభినందించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ టీజేపీఎస్ కళాశాలలో ఇటీవల మూడు రోజుల పాటు జరిగిన ఏఎన్‌యూ మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల్ని జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

పి. వెంకటకృష్ణయ్య (టీజేపీఎస్), ఉమామహేశ్వరరావు, ఐ. కల్యాణ్ కుమార్, కె. నవీన్‌బాబు (కృష్ణవేణి డిగ్రీ కళాశాల, నరసరావుపేట), మధుబాబు, సీహెచ్. కోటి (టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల, కందుకూరు), ఎం. బ్రహ్మ సాయికుమార్ (బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల), డి. బాలిరెడ్డి (బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల), ఎన్. వంశీ (హిందూ కళాశాల), బి. సాయికుమార్ (ఆర్వీఆర్‌జేసీ), వి.మణికంఠ (పీఎస్సీపీ, సింగరాయకొండ), జి. జగన్నాథం (ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల) నుంచి పాల్గొంటున్నట్లు వివరించారు. జట్టు మేనేజర్‌గా టీజేపీఎస్ వ్యాయామ అధ్యాపకుడు ఆర్. శివాజీ, కోచ్‌గా ఎన్. శ్రీనివాసరావు ఎంపికై నట్లు మనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుల్ని ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. జాన్సన్, కళాశాల కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం అభినందించారు.

విజ్ఞాన్ యూనివర్సిటీతో టీఎస్ఎస్‌సీ అవగాహన ఒప్పందం



పత్రాలను టీఎస్ఎస్‌సీ సీఈవో అరవింద్ బాలికి అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్ నాగభూషణ్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీతో న్యూఢిల్లీలోని టీఎస్ఎస్‌సీ (టెలికాం సెక్టార్ స్కిల్ కౌన్సిల్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్‌సీ సీఈవో అరవింద్ బాలితో ఆయన ఒప్పందానికి సంబంధించిన పత్రాల్ని మార్చుకున్నారు. ఈ సందర్భంగా అరవింద్ బాలి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు భారతదేశం స్కిల్ క్యాపిటల్‌గా ఏర్పాటు కాబోతుందని తెలిపారు. యువతలో స్కిల్‌ను డెవలప్ చేసి టెలికాం సెక్టార్‌లో ఉపాధి చూపించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇండస్ట్రీ 4.0, వెబ్ 3.0, 5జీ నెట్‌వర్క్, ఐవోటీ, డ్రోన్స్, ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ వంటి కొత్త టెక్నాలజీల్లో యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్ని నిర్వహించి డిజిటల్ ఇండియాగా మార్చబోతున్నామని వివరించారు. నైపుణ్యాభివృద్ధితోనే జీవితంలో మంచి ఉపాధిని, ఉన్నత స్థానాల్ని పొందగలరని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.